వేసవి దుక్కులతో లాభాలు మెండు

- లోతు దుక్కులతో చీడపీడల నివారణ
- వర్షం నీరు లోతుకు చేరే అవకాశం
- మెరుగైన దిగుబడులకు అవకాశం


పొలంలో మడకలు పడుతున్న రైతులు

కొండాపురం : వేసవి దుక్కులు పంట పొలాలకు ఎంతో మేలుచేస్తాయి. నాగళ్ల సాళ్లతో భూమి వదులుగా మారి పంటకు ఎన్నో ప్రయోజనాలు కల్పిస్తాయి. చీడపీడల ప్రభావం తగ్గి పంట దిగుబడి పెరుగుతోంది. కొండాపురం మండలంలో అడపాదడపా కురుస్తున్న వర్షాలతో రైతులు వేసవి దుక్కులు దున్నుతున్నారు. పొలాల్లో మిగిలిన వ్యర్థాలను కలియదున్నితే సేంద్రియ ఎరువుగా మారడంతో పాటు మట్టిని పెకిలించడం ద్వారా భూమిలో గాలిశాతం పెరుగుతుంది. లోతుగా దున్నితే తొలకరిపైరు వేసుకునేందుకు అనువుగా ఉంటుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. దుక్కి దున్నడం వల్ల కలుపుమొక్కలు పైకి లేచి ఎండకు మాడిపోవడం అదే విధంగా భూమిలో ఉండే పురుగులు పైకి రావడంతో పంట కాల వ్యవధిలో పురుగుల సంతతి కనుమరుగై పైరుకు మేలు జరుగుతోంది. అదే విధంగా వేరు వ్యవస్థ బలబడి పోషకాలు అందుతాయన్నారు. గతంలో ఎండాకాలం పొలాల్లో జీవాల(గొర్ల) మందను పడుకోపెట్టేవాళ్లు. వాటి మల మూత్రాలు పంటల ఎదుగుదలకు ఉపయోగపడేవని రైతులు ఇలా చేసేవారు. ప్రస్తుత రోజుల్లో సంఖ్య తగ్గి పొలాల్లో పేడ ను వేయడం తగ్గించారు. పశువులు, గొర్రల నుంచి వచ్చే సేంద్రియ ఎరువులు వల్ల పంటల ఎదుగుదలకు ఉపయోగపడి దిగుబడి అధికంగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఇంటి ఆవరణలో దిబ్బల్లో నిల్వ చేసిన పశువుల పేడ, గొర్ల ఎరువును ఎండకాలంలోనే పొలాల్లో వేయాలి. వర్షాలు పడిన తర్వాత ఆ ఎరువులను పొలాల్లో చల్లి ట్రాక్టర్‌తో దున్నడంతో మట్టిలో బాగా కలసిపోతాయి. దీంతో పంటలకు అవసరమైన పోషకాలు అందుతాయి. ఒక్కసారి పేడ, గొర్ర ఎరువు వేస్తే వర్షం ద్వారా పడించే పొలాల్లో రెండేళ్లపాటు పోషకాలు పంటలకు లభిస్తాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

దుక్కులు దున్నకపోతే నష్టాలు

కోతల అనంతరం దుక్కి దున్నకుండా వదిలేయడంతో భూమి గాలిని పీల్చుకునే శక్తిని కోల్పోతుంది. అదేవిధంగా లోతైన పొరల నుంచి నీరు ఆవిరై పోతోంది. కలుపు మొక్కలు పెరిగి భూమిలోని నీటిని పోషక పదార్థాలను గ్రహించి భూసారాన్ని తగ్గిస్తాయి. విత్తడానికి వారం పది రోజుల ముందు దుక్కులు తయారు చేయడం వల్ల ఆశించినంత దిగుబడి రాదని అధికారులు తెలుపుతున్నారు.

సేంద్రియ కర్బనం మెరుగు పడుతుంది



ఎండా కాలంలో లోతైన దుక్కుల దున్నడం వల్ల భూమి తిరగడం వల్ల భూమిలో ఉన్న సేంద్రియ కర్బనం పెరగడం జరుగుతుంది. భూమిలోపల ఉండే పురుగులు నశిస్తాయి. ఎండ తీవ్రత వల్ల భూమి లోపల ఉండే శిలింద్రలు తగ్గిపోయే అవకాశం ఉంటుందన్నారు. పంటల్లో వేరుకుళ్ల తెగులు లేకుండా ఉండేందుకు అవకాశం ఉంటుందన్నారు. లోతు దుక్కుల వల్ల నీళ్ల నిల్వ ఉంచుకునే శక్తి ఉంటుంది. దీంతో పంట వేపుగా పెరిగి మంచి దిగుబడులు వస్తాయన్నారు.

– ఏపీ రామాంజులరెడ్డి, మండల వ్యవసాయ అధికారి, కొండాపురం

పశువుల పేడ, గొర్ల మందలతో మంచి దిగుబడి వస్తుంది



ఎండా కాలం పొలాల్లో గొర్ల మంద తోలడం వల్ల గొర్ల మూత్రం వల్ల, గొర్ల ఎరువులతో పొలంలో పోషకాలు ఎక్కువ లభ్యం కావడంతో మంచి దిగుబడులు వస్తాయి. పశువుల పేడ భూమిలో వేయడం వల్ల మూడేళ్ల వరకు భూమిలో సతవ ఉంటుంది. అధిక దిగుబడులు వస్తాయన్నారు. లోతైన దుక్కుల దున్నడం వల్ల భూమిలో ఉన్న పురుగుల ఉధృతి తగ్గే దానికి ఎక్కువ అవకాశం ఉంటుంది.

– ఆర్.లక్ష్మినారాయణరెడ్డి, రైతు.

క్లుప్తంగా

అంధ విద్యార్థినికి ఆర్థికసాయం


అంధ విద్యార్థినికి ఆర్థికసాయం అందజేస్తున్న మానవత సంస్థ సభ్యులు

పులివెందుల టౌన్ : మానవతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం సంస్థ చైర్మన్ డీవీ కొండారెడ్డి రోటరీపురానికి చెందిన వల్లెపురోజ అనే అంధ విద్యార్థినికి రూ.21వేలు అందజేశారు. వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డి సంస్థ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. మానవత సంస్థ శాశ్వత సభ్యులు లింగాల చంద్రశేఖర్‌రెడ్డి, విశ్రాంత అధ్యాపకులు అగడూరు సారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిలు మాట్లాడుతూ తమవంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో మానవత సంస్థ కార్యదర్శి గంగిరెడ్డి, కోశాధికారి హరిశ్చంద్రారెడ్డి, రీజనల్ కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి, కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

గంగమ్మ దేవతకు జలాభిషేకం


గంగమ్మకు జలాభిషేకం చేస్తున్న మహిళలు

ముద్దనూరు : మండలంలోని గంగాదేవిపల్లెలో వెలసిన గంగమ్మదేవతకు ఆదివారం గ్రామస్తులు జలాభిషేకం చేశారు. గ్రామంలోని మహిళలు 108 బిందెల జలంతో అమ్మవారికి జలాభిషేకం చేసినట్లు, సకాలంలో వర్షాలు కురిసి, పశుసంపద వృద్ధిచెందాలని గంగమ్మ దేవతకు జలాభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు.

పరామర్శ

పులివెందుల టౌన్ : పులివెందుల బలిజ సంఘం నాయకుడు గూడూరు ప్రసాద్‌కు యాక్సిడెంట్ జరిగి వైద్య చికిత్సల అనంతరం తన నివాసం వద్దకు వచ్చిన ఆయనను పులివెందుల మున్సిపల్ ఇన్‌చార్జి మనోహర్‌రెడ్డి పరామర్శించారు. కొద్దిరోజుల క్రితం పులివెందుల నుంచి అనంతపురంకు తన సొంత పనులపై వెళుతుండగా మార్గమధ్యంలో కారు ప్రమాదంలో తీవ్రంగా గాయాలు కావడంతో అనంతపురంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్సలు అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరులోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధర్‌రెడ్డి,శ్రీకృష్ణదేవరాయ బలిజ సంఘం పట్టణ నాయకులు యారవ వెంకటసుబ్బయ్య, సోపాల వీర, బ్యాటరీల ప్రసాద్, తోటంశెట్టి హరి, రామాంజనేయులు, ఫొటో స్టూడియో హరి, కుళ్లాయప్ప, భాకరాపురం కౌన్సిలర్, ఎక్స్ కోఆప్షన్ బాబయ్య, ఇతర నాయకులు పరామర్శించారు.

ఆపరేషన్ కగార్‌ను తక్షణం నిలిపివేయాలి

కమలాపురం : మావోయిస్టులను అంతం చేయడానికి కేంద్రం చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను తక్షణం నిలిపి వేయాలని సీపీఐ మండల కార్యదర్శి నాగేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మావోయిస్టు కేంద్ర కార్యదర్శి నంబాల కేశవరావుతో సహా 27 మంది ఆదివాసీలు, మావోయిస్టులను ఎన్‌కౌంటర్ పేరుతో కేంద్ర సాయుధ బలగాలచే హత్య చేయించారని దీనిపై తక్షణం న్యాయ విచారణ చేపట్టాలని ఆయన అందులో డిమాండ్ చేశారు. ఆపరేషన్ సిందూర్‌ను నిలిపివేసి పాకిస్తాన్‌తో చర్చలకు పూనుకుంటున్నారు గాని, సొంత దేశంలోని మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలకు ముందుకు రాకుండా ద్వంద వైఖరి అవలంభిస్తున్నారన్నారు. ఇప్పటికైనా కేంద్రం స్పందించి ఆపరేషన్ కగార్‌ను తక్షణం నిలిపివేయాలని ఆయన కోరారు.

కొవ్వూరు గంగమ్మ సన్నిధిలో సతీష్‌రెడ్డి


కొవ్వూరు గంగమ్మకు పూజలు చేస్తున్న సతీష్‌కుమార్‌రెడ్డి

చక్రాయపేట : మండలంలోని గండికొవ్వూరు గ్రామంలో వెలసిన కొవ్వూరు గంగమ్మ దేవతను ఆదివారం వైఎస్‌ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌వీ సతీష్‌కుమార్‌రెడ్డి దర్శించుకున్నారు. అలాగే వైఎస్‌ఆర్‌సీపీ నేత బ్రంహానందరెడ్డి, గండి పాలకమండలి సభ్యురాలు జయమ్మ మనుమడు మునిసుశాంత్‌రెడ్డి కేశఖండన కార్యక్రమంలో ఆయనతో పాటు చక్రాయపేట వేంపల్లె మండల కన్వీనర్లు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, చంద్రఓబుళరెడ్డి, జడ్పీటీసీ సభ్యులు శివప్రసాదరెడ్డి, రవికుమార్‌రెడ్డి, సతీష్‌రెడ్డి సోదరుడు విష్ణువర్ధన్‌రెడ్డి, తులసిరెడ్డి తదితరులు హాజరయ్యారు.

ఘనంగా గంగమ్మతల్లికి పూజలు


విశేష అలంకారంలో గంగమ్మతల్లి

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట గంగమ్మతల్లి ఆదివారం ఘనంగా పూజలు జరిగాయి. అమ్మవారికి పట్టు వస్త్రాలు, గంధం, పసుపు, వేపాకు నిమ్మకాయలు, పూలదండలు, తోమాలతో విశేష అలంకరణ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి తమ మొక్కుబడులను అమ్మవారికి చెల్లించుకున్నారు. మహిళా భక్తులు అమ్మవారికి బోనాలు పట్టి కోళ్లు, పొట్టేలు, మేకపోతులను బలిగా ఇచ్చి మొక్కుబడులను తీర్చుకున్నారు. అనంతరం బంధుమిత్రులతో కలిసి విందు భోజన కార్యక్రమాలలో పాల్గొన్నారు. అలాగే గంగమ్మ దేవాలయం సమీపంలోని వీరభద్రస్వామి, శివాలయం, ఆంజనేయస్వామి దేవాలయాలలో కూడా భక్తులు విశేష పూజలు నిర్వహించారు.

బీసీ జిల్లా యవజన అధ్యక్షుడిగా చల్లా బాలాజీ


నూతన బీసీ సంక్షేమ సంఘం జిల్లా సభ్యులను అభినందిస్తున్న నాయకులు

వేంపల్లె : జాతీయ బీసీ సంక్షేమ సంఘం యవజన అధ్యక్షుడిగా చల్లా బాలాజీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా నూతన కమిటీ ఎన్నికలలో భాగంగా ఆదివారం వేంపల్లెలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు వనమాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ నేపథ్యంలో జిల్లా గౌరవ అధ్యక్షుడిగా బత్తల ఆదినారాయణ, జిల్లా యవజన అధ్యక్షుడిగా చల్లా బాలాజీ, సంయుక్త కార్యదర్శిగా బత్తుల చలపతి, జిల్లా ప్రచార కమిటీ చైర్మన్‌గా ఎం .నాగేశ్వరావు, జిల్లా కమిటీ సభ్యుడిగా వెంకటసుబ్బయ్య, పులివెందుల నియోజకవర్గం గౌరవ అధ్యక్షుడిగా వి.రత్తయ్యను ఎన్నుకున్నారు. అలాగే పులివెందుల నియోజకవర్గం అధ్యక్షుడిగా వల్లెపు బుజ్జిబాబు, ఉపాధ్యక్షుడిగా వి.రామచంద్ర, పులివెందుల నియోజకవర్గం ప్రచార కమిటీ చైర్మన్‌గా ఎం .గంగోజీ, వేంపల్లె మండలం అధ్యక్షుడిగా వల్లెపు వెంకటసుబ్బయ్య, ఉపాధ్యక్షుడిగా జి. భాస్కర్ రెడ్డప్ప నియమించారు. నూతన కమిటీలో నియామక అయిన వారందరికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు వనమాల శ్రీనివాస్ మాట్లాడుతూ బీసీలకు కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే బీసీ రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఉన్న అన్ని బీసీ కులాలను కలుపుకుని ఐక్యతతో బీసీ కులాల అభివృద్ధికి పాటుపడాలన్నారు. చిత్తూరు జిల్లాలో బలోపేతం చేయడానికి కషి చేస్తామన్నారు. సమావేశంలో రాష్ట్ర ప్రోగ్రాం కో ఆర్డినేటర్ ఎస్.సురేంద్రరాజ్ రెడ్డి, ఆర్‌సీడీఎస్ మంచూరి వెంకటసుబ్బారెడ్డి, వేంపల్లె వడ్డెర సంఘం అధ్యక్షుడు మల్లె సంటన్న, గోగుల మల్లికార్జున, బీసీ కులాల నాయకులు పాల్గొన్నారు.

ఉక్కు పరిశ్రమపై స్పష్టమైన ప్రకటన చేయాలి

కమలాపురం : నిత్యం కరువు, ఆత్మహత్యలతో అల్లాడుతున్న రాయలసీమ ప్రాంత అభివృద్ధికి లక్ష కోట్ల బడ్జెట్ కేటాయించడంతో పాటు ఉక్కు పరిశ్రమపై స్పష్టమైన ప్రకటన చేయాలని ఆర్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డీఎం ఓబులేసు డిమాండ్ చేశారు. ఆదివారం కమలాపురంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 27వ తేదీ నుంచి కడపలో జరుగుతున్న మహానాడు కార్యక్రమానికి విచ్చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కడప ఉక్కుపై స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. రాష్ట్ర విభజన అనంతరం దేశంలోనే అత్యంత వెనుకబడిన ప్రాంతం రాయలసీమ ఉందని పాలకులే నాడు చెప్పారని ఆయన గుర్తు చేశారు. కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. పార్లమెంటు సాక్షిగా సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామని చెప్పి గడిచిన 15 ఏళ్లలో ఉక్కు ఫ్యాక్టరీకి ఒక్క రుపాయి కూడా చెల్లించక పోవడం దారుణం అన్నారు. ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మందికి ఉపాధి లభిస్తుందన్నారు. సీమలో పెండింగ్‌లో ఉన్న సాగు, తాగు నీటి ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు నిధులు కేటాయించాలన్నారు. కడప–బెంగళూరు రైల్వే లైన్ అమరావతి వరకు పొడిగించాలన్నారు. కడపలో సెంట్రల్ యూనివర్శిటీ ఏర్పాటు చేయాలన్నారు. కడప రిమ్స్‌ను సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలన్నారు. తిరుపతిలో 16 వేల ఎకరాలకు పైగా ఉన్న ఎర్ర చందనానికి ఆధారిత పరిశ్రమ ఏర్పాటు చేయాలన్నారు. కొప్పర్తి పారిశ్రామిక వాడలో 70 శాతం ఉద్యోగాలు స్థానికులకే కేటాయించాలన్నారు. సీమ ప్రాంత అభివృద్ధికి లక్ష కోట్ల నిధులు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. సీమ ప్రాంతానికి చెందిన నాయకులు సీమ సమస్యలన్నీ మహానాడు వేదికగా సీఎంకు తెలియజేయాలని ఆయన పేర్కొన్నారు.

ఇరిగేషన్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కడప రూరల్: ఇరిగేషన్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు కోరారు. ఆదివారం స్థానిక ఇరిగేషన్ అతిథి గృహంలో ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామనాయుడును ఎన్జీఓ అసోషియేషన్ నేతలు కలిసి, ఆయనను సన్మానించారు. అనంతరం శ్రీనివాసులు మాట్లాడుతూ ఇరిగేషన్ శాఖ ఉద్యోగులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


పులివెందులలో అప్పటి ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

పులివెందుల టౌన్ : ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2003–2004 సంవత్సరం పదవ తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తమ పాఠశాల ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించుకున్నారు. తమ చిననాటి జ్ఞాపకాలను టీచర్లతో పంచుకున్నారు. స్నేహితులతో సంభాసిస్తూ ఏమిరా ఎలా ఉన్నావు..ఏమి చేస్తున్నావు..పెళ్లి అయ్యిందా.. పిల్లలు ఏమి చేస్తున్నారని ఆప్యాయంగా పలుకరించుకుంటూ తీపిగురుతులను నెమరేసుకున్నారు. అనంతరం పాఠశాల అభివృద్ధి కోసం రూ.15,100 హెడ్మాస్టర్ శ్రీనివాసరెడ్డికి అందించారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల(జమ్మలమడుగు) : పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో ఆదివారం 1992–93 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న విద్యార్థులు 32 సంవత్సరాల తర్వాత కలుసుకున్నారు. గత ఉపాధ్యాయులకు ఘనంగా స్వాగతం పలికి ఆత్మీయ సత్కారం చేశారు. అప్పటి ఉపాధ్యాయులైన మునిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, మనోహర్‌రెడ్డి, మైసూరయ్య, చంద్రఓబుళరెడ్డిలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామాంజనేయరెడ్డి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.


ఎర్రగుంట్లలో అప్పటి ఉపాధాయులతో పూర్వ విద్యార్థులు

కాలువలో అడ్డుగా ఉన్న మట్టిని తొలగించాలి


మట్టికారణంగా మురికి నీరు నిల్వ ఉన్న రాచన కాలువ వంక

చింతకొమ్మదిన్నె : మండలంలోని అంగడివీధి, సీఎంఆర్‌పల్లి, తెలుగుగంగ కాలనీలోని మురికి నీరు రాచనకాలువ వంక గుండా గతం నుంచి వెళ్ళేది. అయితే రైల్వే కాలనీలో కాలువను రిపేర్ చేస్తూ రాచనకాలువ నుండి వంకలోనికి మురికి నీరు వెళ్లకుండా మట్టిని అడ్డుగా వేయడంతో ఆ నీరు సమీపంలోని అంగడివీధి లోతట్టు నివాసాలలోకి వస్తుండటంతో సమీప ప్రజలందరూ దుర్వాసన భరించలేక, దోమలు తాకిడికి గురై రోగాల బారిన పడుతున్నారు. స్థానిక సచివాలయంలో, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు తెలిపినా ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. అధికారులు తీరు మార్చుకుని కాలువకు అడ్డంగా వేసిన మట్టిని తొలగించి మురికి నీరు రాచనకాలువ ద్వారా వంకలోకి వెళ్లే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని కడప నగర 17, 18వ డివిజన్లకు చెందిన శ్రీరామ్, రమణ మరి కొందరు తెలిపారు.

పదోన్నతుల్లో పారదర్శకత పాటించాలి

జమ్మలమడుగు : ఉమ్మడి కడప జిల్లాల్లో జరుగుతున్న ప్రధానోపాధ్యాయుల పదోన్నతులను పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా మాదిగ ఉద్యోగుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు పిచుక బాబు మాదిగ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అధికారులు పదోన్నతుల్లో ప్రతి సారి అడక్వెన్సీ పేరుతో ఎస్సీల 15 శాతం కోటాను తగ్గించే ప్రయత్నం చేయడం దారుణం అన్నారు. ఎస్సీల కోటాలో ఏరకంగా ఎక్కువ మంది ఉన్నారో పూర్తి వివరాలతో రిజర్వేషన్లు వారిగా వెల్లడించాలన్నారు. ప్రధానోపాధ్యాయుల హోదాతో సమానమైన ఎంఈఓ–2 పోస్టులను లెక్కించాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ప్రధానోపాధ్యాయ పదోన్నతుల్లో ఎస్సీల, ఉప వర్గీకరణ కోటాను ఏవిధంగా భర్తి చేస్తారో బహిర్గతపరచాలన్నారు. పదోన్నతుల్లో ఎస్సీలకు అన్యాయం జరిగితే సహించేది లేదన్నారు.

మోడల్ డీఎస్సీ పరీక్షను సద్వినియోగం చేసుకోండి

జమ్మలమడుగు : డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీన జరిగే మోడల్ డీఎస్సీ పరీక్షను అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ చంద్రశేఖర్‌రావు తెలిపారు. ఆదివారం ఎంఈఓ కార్యాలయంలో డీఎస్సీ నమూనా పరీక్ష కరపత్రాలను ఆయన విడుదల చేసి మాట్లాడారు. డీఎస్సీ పరీక్షలు రాసే అభ్యర్థులకు పరీక్ష ఏవిధంగా ఉంటుందో తెలుసుకోవడంతోపాటు పోటీ పరీక్షల్లో తమ స్థాయి ఎమిటో తెలుస్తుందన్నారు. తద్వారా మరింత కష్టపడి చదువుకునేటందుకు ప్రణాళికలు చేసుకునే అవకాశం ఉందని సూచించారు. ఇప్పటికే చాలా మంది డీఎస్సీకి కోచింగ్ తీసుకోవడం జరుగుతుంది. అనంతరం డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ మాట్లాడుతూ తమ పోరాటాల ఫలితంగానే ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు. డీఎస్సీ పరీక్షా పత్రాన్ని మాజీ ఎమ్మెల్సీ, ప్రముఖ విద్యావేత్త లక్ష్మణ్‌రావు చేత తయారు చేయించడం జరిగిందన్నారు. అభ్యర్థులకు కడపలోని వెంకట సాయి కోచింగ్ సెంటర్‌లోని యూటీఎఫ్ భవనం నందు, ప్రొద్దుటూరులో స్పృజన్ కోచింగ్ సెంటర్‌లో, జమ్మలమడుగులో ఎస్పీ డిగ్రీకాలేజీలో పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు పరీక్షకు కేవలం రూ.50 ఎంట్రీ ఫీజు చెల్లించాలని సూచించారు.

మానవసేవ పరమాత్ముని సేవ

కడప సెవెన్‌రోడ్స్ : మానవసేవ పరమాత్ముని సేవగా ప్రతిఒక్కరూ భావించాలని మానవత సంస్థ వ్యవస్థాపకులు రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో డాక్టర్ సి.సుబ్బారెడ్డి అధ్యక్షతన ఆ సంస్థ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ మానవత సంస్థ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని కోరారు.

‘ముత్యంలా బయటకు వస్తారు’


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పులివెందుల టౌన్ : ఎన్ని అక్రమ కేసులు పెట్టిన వైఎస్ జగన్, వైఎస్ అవినాష్‌రెడ్డిలు కడిగిన ముత్యంలా బయటకు వస్తారని వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. ఆదివారం వైఎస్ మనోహర్‌రెడ్డి స్వగృహంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. త్వరలో జగన్, అవినాష్‌లు జైల్‌కు వెళ్తారని తద్వారా మా అరాచకాలు మరింత పేట్రేగుతాయి అని ఓ పెద్దమనిషి గొంతు చించుకుని అరవడం చూస్తే అధినాయకుడి మెప్పుపై ఉన్న నిబద్ధత ప్రజా సమస్యలపై లేకపోవడం చాలా బాధాకరమన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిల గురించి మాట్లాడకపోతే బీటెక్ రవిని ప్రజలతో పాటు టీడీపీ నాయకత్వం కూడా మర్చిపోతుందని.. అందుకే రాష్ట్రంలో ఏ సమస్యలు లేనట్లు తన గుర్తింపు కోసం అబద్ధాలు ప్రచారం చేస్తూ తపన పడుతున్నాడన్నారు. జరగని మద్యం కుంభకోణాన్ని జరిగినట్లు, ఏ మాత్రం ఆధారాలు లేని ఒక కల్పిత కోణాన్ని సృష్టించి చిరుద్యోగులను బెదిరించి అబద్ధపు వాంగ్మూలాలు నమోదు చేసి కక్షపూరిత రాజకీయ కుట్రతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అరెస్ట్ చేయించాలని తాపత్రయ పడుతున్నారన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రెస్ మీట్ పెట్టి చాలా విపులంగా మద్యం అమ్మకాల గురించి నిజాలు నిర్భయంగా కళ్లకు కట్టినట్టు మాట్లాడితే ఇంతవరకు దానికి టీడీపీ నుంచి కౌంటర్ ఇచ్చే నాథుడే లేడన్నారు. ఇకపోతే వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఏదో సెల్ టవర్ శాస్త్రీయత అంటూ అధికార పార్టీ పెద్దలంతా కలిసి ఢిల్లీ స్థాయిలో రాయించిన అఫిడవిట్‌లో సంతకం పెట్టిన అధికారి కంటే బీటెక్ రవికే ఎక్కువ శాస్త్రీయత తెలిసినట్లు మాట్లాడుతున్నారన్నారు. అందులో పులివెందులలో ఉన్నదే 4 టవర్‌లు దాదాపు 80 వేల మంది ఆ టవర్ డంప్ కిందే ఉంటారు. దాదాపు వైఎస్ కుటుంబీకుల స్వగృహాలతో పాటు 10 వేల గృహాలు ఉన్న భాకరాపురంలో హత్య జరిగితే భాకరాపురం టవర్ కింద ఉన్న 10 వేల గృహాలలో నివసించే వారంతా హత్యతో సంబంధం ఉన్నవారు అవుతారా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా వైఎస్సార్‌సీపీ నాయకులు జైలుకు పంపితే తప్ప మీ భవితవ్యం ఉండదు అనే భావనలోనుంచి బయటకు వచ్చి ప్రజా సమస్యలపై, పులివెందుల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని వారు హితవు పలికారు. ఈ సమావేశంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చిన్నప్ప, రాష్ట్ర మాజీ నూర్‌బాషా సంఘం మాజీ చైర్మన్ రసూల్, పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధర్‌రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్, రాష్ట్ర బూత్ కమిటీ నాయకులు చంద్రమౌళి, పట్టణ కార్యదర్శి విజయ్‌భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి


పులివెందులలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న కోలా ప్రసాద్, మహిళలు, చిన్నారులు


జమ్మలమడుగులో కొవ్వొత్తులతో నివాళులు అర్పిస్తున్న దళిత నాయకులు

పులివెందుల : జమ్మలమడుగు నియోజకవర్గం మైలవరం మండలం ఎ.కంబాలదిన్నె గ్రామంలో నాలుగేళ్ల బాలికపై అత్యాచారం చేసి చంపిన యువకుడిని కఠినంగా శిక్షించాలని పులివెందులలో ఆదివారం సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. దళిత ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు కోలా ప్రసాద్ ఆధ్వర్యంలో పులివెందుల పాస్టర్స్ అసోసియేషన్, అంబేడ్కర్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. స్థానిక ఆర్టీసీ సర్కిల్ వద్దనుంచి కొవ్వొత్తులు, ప్లకార్డులు పట్టుకుని మెయిన్ బజార్, పూలంగళ్ల సర్కిల్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కోలా ప్రసాద్ మాట్లాడుతూ అత్యాచారం చేసిన యువకుడిని కఠినంగా శిక్షించి ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో దళిత ఫెడరేషన్ సభ్యులు, పాస్టర్లు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : కంబాలదిన్నె గ్రామంలో కామాంధుడి చేతిలో ఆఘాయిత్యానికి గురై మరణించిన చిన్నారి మృతికి ఎమ్మార్పీఎస్ నాయకులు కొవ్వొత్తులతో ఆదివారం సాయంత్రం పాతబస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీస్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు పిచ్చుక బాబు ఆధ్వర్యంలో దళిత సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. నిందితుడిని కఠినంగా శిక్షించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో దళిత నాయకులు పాల్గొన్నారు.

స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

ఎర్రగుంట్ల(జమ్మలమడుగు) : ఎర్రగుంట్ల పరిసర ప్రాంతాల్లో ఉన్న సిమెంట్ పరిశ్రమలలో స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిమెంట్ పరిశ్రమల ఏర్పాటు కోసం రైతుల నుంచి భూమి, ప్రభుత్వం నుంచి రాయితీలు పొంది స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించకుండా పరిశ్రమ నుంచి వెలువడే విషవాయువులతో ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. కాలుష్య నియంత్రణ సరిగ్గా చేయకపోవడం వలన ఎర్రగుంట్ల పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర అనారోగ్య సమస్యలు పడుతున్నారు. కంపెనీ సామాజిక బాధ్యత నిధులు, విద్య వైద్యం, పర్యావరణ పరిరక్షణ కోసం ఖర్చు చేయాల్సి ఉన్నప్పటికి చేయకుండా దొంగ బిల్లులు చూపిస్తున్నారని ధ్వజమెత్తారు. కంపెనీలు సీఎస్‌ఆర్ నిధులు ఏఏ పనులకు ఖర్చుపెట్టారో ఎక్కడ ఖర్చు పెట్టారో బహిరంగ పరాచాలన్నారు. సిమెంట్ పరిశ్రమలలో ఒప్పందం ప్రతిపాదికన కార్మికులను నియమించుకుంటూ చాలీచాలని జీతాలతో శ్రమ దోపిడీ చేస్తున్నారని, కార్మికులు జీతాలు పెంచాలని అడిగితే నిర్దాక్షిణ్యంగా కార్మికులను తొలగిస్తున్నారని మండి పడ్డారు. సిమెంట్ పరిశ్రమ పరిసర ప్రాంతాల్లో స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని, కనీసం వేతనం, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో పరిసర ప్రాంతాల ప్రజలతో కలసి పెద్ద ఎత్తున పోరాటం చేయకతప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బ్యాటరీలు చోరీ


దొంగతనానికి గురైన లారీ బ్యాటరీ

సింహాద్రిపురం : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమీపాన మెయిన్ రహదారిపై చుట్టూ జనసంచారము ఉండి సీసీ కెమెరాలు ఉన్నా ఆదివారం తెల్లవారు జామున రెండవసారి లారీల నాలుగు బ్యాటరీలను దొంగలు దొంగలించారు. జనవరి 28వ తేదీన అర్ధరాత్రి హోల్టింగ్‌లో ఉన్న నాలుగు లారీల బ్యాటరీలు దొంగలించారు. అలాగే భాస్కర్ రెడ్డి అనే ట్రాక్టరుకు సంబంధించిన బ్యాటరీని కూడా అపహరించారు. జనవరి 29న లారీ యజమాని బాబురెడ్డి గతంలో ఫిర్యాదు చేశారు కానీ ఎలాంటి ఫలితం లేదు. మళ్లీ ఇప్పుడు రెండవసారి అదే లారీలకు ఉన్న బ్యాటరీలు దొంగలించబడ్డాయని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈసారైనా దొంగలను పోలీసులు పట్టుకుని ఇలాంటి దొంగతనాలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.